క్లుప్తంగా

మెకానిక్ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

తొండూరు : 108 అంబులెన్స్‌లో సర్వీసెస్‌లో ఖాళీగా ఉన్న మెకానిక్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని 108, 104 సర్వీస్ జిల్లా ఫ్లీట్ మేనేజర్ రామసుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులకు 10వ తరగతి ఉత్తీర్ణతతోపాటు ఐటీఐ డీజిల్ మెకానిక్ విద్యార్హత ఉండాలన్నారు. ఈనెల 25వ తేదీన కడప ఓల్డ్ రిమ్స్ 108, 104 సర్వీస్ ఆఫీసులో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు జిరాక్స్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

ఎర్రగుంట్ల : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని జిల్లా విద్యాధికారి దేవరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమాలు అందుతున్నాయా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనపై విద్యార్థినులతో చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వసుంధరదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు సహకరించండి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

పులివెందుల టౌన్ : జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి కోరారు. బుధవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీలు, మెప్మా ఆర్పీలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. జగనన్న హౌసింగ్ కాలనీలో ఇళ్లు పొందిన లబ్ధిదారులకు కట్టించవలసిన రూ.35 వేలు కట్టించే విషయమై మెప్మా సిబ్బంది అలసత్వం వహించకుండా కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన పట్టణంలోని పలు వార్డు సచివాలయాలను, పలు హోటళ్లను, కూరగాయల మార్కెట్‌ను ఆకస్మిక తనిఖీ చేసి పరిశీలించారు. కార్యక్రమంలో సీఎంఎం గంగులయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పెట్రోల్ బంకుల తనిఖీ


పెట్రోల్ బంకులో తనిఖీ చేస్తున్న తహసీల్దార్ ఎ.నాగేశ్వరరావు

ఎర్రగుంట్ల : పట్టణంలో ఉన్న పెట్రోల్ బంకులను బుధవారం తహసీల్దార్ ఎ. నాగేశ్వరరావు ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంకులను తనిఖీ చేసి అందులో ఉన్న సదుపాయాలను పరిశీలించామన్నారు. రికార్డులను, పెట్రోల్, డీజిల్ నాణ్యతలను, పరిమాణంను అక్కడ ప్రజల కొరకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.

ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి

వేంపల్లి : పంటలు సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని ఏఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం వేంపల్లెలోని రైతు భరోసా కేంద్రాలలో వ్యవసాయ సిబ్బందిని ఆయన కలసి పంట నమోదుతోపాటు రైతు బయోమెట్రిక్ అథెంటిఫికేషన్ చేసుకోవాలన్నారు. పంట నమోదు చేసుకోవడంవల్ల ప్రభుత్వ పథకాలతోపాటు పంట రుణాలు, ఇన్సూరెన్స్ వర్తిస్తాయన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించండి

పెద్దముడియం : అధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ఎంపీపీ కె.కె.సుధ తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కె.కె. అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండలస్థాయి అధికారులు ప్రగతి నివేదికలతో హాజరై చదివి వినిపించారు. ఎంపీడీఓ వెంకటరమణయ్య మాట్లాడుతూ జగనన్న కాలనీలల్లో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారుల చేత వెంటనే పూర్తి చేయించాలని తెలిపారు. కరెంట్, తాగునీటి సరఫరా, డ్రైనేజీ జగనన్న కాలనీలకు ఏర్పాటు చేయాలని తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ రైతులందరూ రీ సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధంగా సబ్‌స్టేషన్

- రూ.1.80 కోట్లతో నిర్మాణాలు పూర్తి
- రైతులకు తీరనున్న లో ఓల్టేజీ సమస్య


గొల్లలగూడూరులో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్

వేముల : రైతులకు సకాలంలో విద్యుత్ సరఫరా చేయడంతోపాటు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం విద్యుత్ సబ్‌స్టేషన్లను నిర్మిస్తోంది. ఇందులో భాగంగా మండలంలోని గొల్లలగూడూరు గ్రామంలో నూతనంగా రూ.1.80 కోట్ల వ్యయంతో విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించారు. ఈ సబ్‌స్టేషన్ పనులు పూర్తి చేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉంది. ఇప్పటివరకు రైతులకు పెర్నపాడు, పెద్దజూటూరు సబ్ స్టేషన్ల నుంచి వ్యవసాయ మోటార్లకు విద్యుత్‌ను సరఫరా చేసేవారు. దీంతో రైతులకు లో ఓల్టేజీ సమస్య ఎదురవ్వడం, నాణ్యమైన విద్యుత్ అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడేవారు. లో ఓల్టేజీతో తరచూ మోటార్లు కాలిపోయేవి. ఈ సబ్‌స్టేషన్ల పరిధిలో వ్యవసాయ మోటార్లు ఎక్కువగా ఉండటం, అధికలోడు విద్యుత్ అందేది కాదు.. ఈ విషయాన్ని గొల్లలగూడూరు రైతులు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గ్రామానికి ఆయన విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు చేయించారు. త్వరితగతిన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధం చేసి ఉంచారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో గ్రామంలో రైతులకు ఎంతో మేలు చేకూరనుంది. వ్యవసాయ మోటార్లకు నాణ్యమైన విద్యుత్ అందనుంది. గ్రామంలో సబ్‌స్టేషన్ నిర్మాణం పూర్తి కావడంపట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు సకాలంలో వైద్యం అందించాలి


చిలంకూరులో వ్యాధిగ్రస్తులకు సూచనలు అందిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ ఖాదర్‌వలి

ఎర్రగుంట్ల : కుష్టు వ్యాధితో బాధపడుతున్న వారికి సకాలంలో వైద్యం అందించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చిలంకూరు పిహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. వ్యాధిగ్రస్తుల ఇళ్ల వద్దకు వెళ్లి వారికి వైద్యం అందించి మందులను సకాలంలో అందించాలన్నారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు సురేష్మా, సాయిచరిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం ఎర్రగుంట్ల పట్టణంలోని రాణీవనంలో ఉన్న పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ జ్యోత్స్న, సిబ్బంది పాల్గొన్నారు.

10వ తరగతి మార్కులే భవిష్యత్‌కు పునాది

ఎర్రగుంట్ల : పదవ తరగతిలో సాధించిన మార్కులే భవిష్యత్‌లో ఉన్నత చదువులకు పునాది అని ఎర్రగుంట్ల పట్టణ సీఐ మంజునాథ్ రెడ్డి తెలిపారు. బుధవారం తిప్పలూరు గ్రామంలో ఉన్న శ్రీసాయిచరణ్ హైస్కూల్‌లోని పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సభ ఏకేఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సభకు సీఐ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులు పక్కదారి పట్టకుండా పదిలో మంచి మార్కులు సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. రోజుకు ఎనిమిది గంటలు చదవాలన్నారు. విద్యార్థి దశలో ఉపాధ్యాయులు చెప్పిన నీతి నియమాలు భవిష్యత్‌లో ఉపయోగపడుతాయన్నారు. పాఠశాల కరస్పాండెంట్ మోహన రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించండి


మాట్లాడుతున్న వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

పెండ్లిమర్రి : వేరుశనగ పంట సాగు చేసిన రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గొందిపల్లె గ్రామ పొలాల్లో బుధవారం వేరుశనగ పంటలో పొలంబడి క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో ఆకు మచ్చ తెగుళ్లపై జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆకు మచ్చ తెగులు ఆశిస్తే పంట దిగుబడి తగ్గుతుందన్నారు. వాటిని పూర్తిగా నివారించాలన్నారు. అనంతరం రైతులకు పంటల సాగుపై పలు సలహాలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏడీఏలు రమణారెడ్డి, సుబ్బారావు, ఆత్మ పీడీ విజయలక్ష్మి, ఏఓలు పద్మజ, పద్మలత, బ్లెస్సీ, రైతులు పాల్గొన్నారు.

జారిపడిన లిఫ్ట్

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థలో కరెంటు ఆఫ్ కావడంతో లిఫ్ట్ జారిపడింది. ఆ సమయంలో అందులో ఎక్కిన ముగ్గురు ఉద్యోగులు కిందికి జారి సుమారు అరగంట పాటు ఇరుక్కుపోయారు. అదృష్టవశాత్తు లిఫ్ట్ రెండో అంతస్తు నుంచి జారిపడినా అందులో ఉన్న ఉద్యోగులకు ఏమీ కాకపోవడంతో సహచర ఉద్యోగులు ఊపిరి పీల్చుకున్నారు. చివరికి లిఫ్ట్ ఆపరేటర్లు వచ్చి వారిని బయటికి తీశారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణలు అవాస్తవం

- గతంలో దళితుల భూములు తీసుకున్న ప్రభుత్వం
- ప్రత్యామ్నాయంగా సాగు చేసుకుంటున్న దళితులు
- డీకేటీ పట్టాలు ఇచ్చి దళితులకు న్యాయం చేస్తున్నాం
- వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి



వేముల : ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందన్న విషయం పూర్తిగా అవాస్తవమని.. గతంలో దళితుల భూములను ప్రజాప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం తీసుకుందని.. అందుకు ప్రత్యామ్నాయంగా సమీపంలో దళితులు భూములు సాగు చేసుకుంటున్నారని.. వారందరికి డీకేటీ పట్టాలు ఇప్పించి న్యాయం చేస్తున్నామని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి బుధవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనంపై తీవ్రంగా స్పందించారు. వేములలోని ఎస్సీ కాలనీకి చెందిన భూమిలేని నిరుపేదలకు దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో గుట్టపై 1051 సర్వే నంబర్‌లో నలుగురికి అప్పటి ప్రభుత్వం డీకేటీ పట్టాలు మంజూరు చేసిందని, అయితే ఆ ప్రాంతంలో ప్రజా ప్రయోజనాల దృష్ట్యా దళితులకు ఇచ్చిన డీకేటీ భూములను ప్రభుత్వం తీసుకుందన్నారు. ఈ సర్వే నంబర్‌లో ప్రభుత్వ జూనియర్, ఐటీఐ కళాశాలల నిర్మాణాల కోసం గోటూరు అంజనమ్మ, స్వామివరప్పు రమణమ్మ, ఇల్లూరు విక్టోరియా, సాకే అంజనమ్మ అనే దళిత మహిళలకు ఇచ్చిన డీకేటీ భూములను స్వాధీనం చేసుకుందన్నారు. అప్పట్లో వారికి వేరే ప్రాంతంలో డీకేటీ భూములు ఇస్తామని అధికారులు చెప్పారని, అయితే ఇప్పటివరకు అధికారులు దళితులకు న్యాయం చేయలేదన్నారు. దీంతో డీకేటీ భూములు కోల్పోయిన దళితులంతా పెద్దజూటూరు గ్రామ పొలంలో భూమిని సాగు చేసుకుంటున్నారన్నారు. వీరికి అసైన్‌మెంట్ కమిటీ సమావేశం జరిగిన వెంటనే డీకేటీ పట్టాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతే తప్ప వాస్తవాలు తెలుసుకోకుండా సీఎం నియోజకవర్గంలో ప్రభుత్వ భూమిని కొల్లగొడుతున్నారంటూ తప్పుడు కథనాలు రాయడంపై నాగేళ్ల సాంబశివారెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైనట్లు నిరూపించాలని ఆయన సవాల్ విసిరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి, చలపతి, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా కొనసాగని డిప్యూటీ తహసీల్దార్లు


ఖాళీగా వున్న డిప్యూటీ తహసీల్దారు కుర్చీ

ముద్దనూరు : రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు తర్వాత అంతటి ప్రాధాన్యత కలిగిన అధికారి కార్యాలయ డిప్యూటీ తహసీల్దారు. అయితే స్థానిక రెవెన్యూ కార్యాలయంలో విధుల్లో చేరుతున్న డిప్యూటీ తహసీల్దార్లు మాత్రం తమ కాలపరిమితికి ముందే ఏదో ఒక సాకుతో ఇక్కడినుంచి వెళ్లిపోతున్నారు. దీనికి తోడు మండల పరిధిలో ఇంచార్జి సర్వేయర్లు, వీఆర్వోలు కొనసాగుతుండటంతో ప్రజలకు ఇబ్బందిగా మారింది. సచివాలయ సిబ్బందికి ఇంచార్జి బాధ్యతలు పెరుగుతున్నాయి. సుమారు ఏడాదినుంచి మొత్తం నలుగురు డిప్యూటీ తహసీల్దార్లు విధుల్లో నిలకడగా కొనసాగకుండానే వెళ్లిపోయారు. డిప్యూటీ తహసీల్దారు మల్లికార్జున బదిలీ తర్వాత ఇక్కడకు కిషోర్ అనే డీటీని నియమించారు. కొద్దిరోజుల అనంతరమే ఆయన వెళ్లిపోయారు. తర్వాత సాంబశివరావును డీటీగా నియమించారు. ఆయన కూడా కొద్ది నెలలు పనిచేసి బదిలీపై వెళ్లారు. ఆ తర్వాత సాధారణ బదిలీలలో భాగంగా 4 నెలల క్రితం జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయం నుంచి మౌనిక అనే డిప్యూటీ తహసీల్దారును నియమించారు. ఆమె కూడా సెలవుల్లో వెళ్లి, తిరిగి ఒక నెల క్రితం బదిలీపై కడపకు వెళ్లారు. మౌనిక తర్వాత ఇటీవలే కొద్దిరోజుల క్రితం డిప్యూటీ తహసీల్దారుగా మీనాను నియమించారు. ఆమె విధుల్లో చేరిన వెంటనే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ప్రస్తుతం సమగ్ర భూసర్వే డీటీగా వున్న సౌజన్య ఇంచార్జ్ డీటీగా కొనసాగుతున్నారు. రెవెన్యూ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తున్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి. సిబ్బంది కొరత, ఇంచార్జి బాధ్యతలతో పనులు సక్రమంగా జరగడంలేదని ప్రజలు వాపోతున్నారు.

ఆదర్శప్రాయుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి


నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు

పులివెందుల టౌన్ : ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అందరికీ ఆదర్శప్రాయుడు అని ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.ఎస్.బేగ్ అన్నారు. బుధవారం స్థానిక ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాలలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులందరూ ఉయ్యాలవాడ జీవిత చరిత్ర నుంచి ధైర్యంగా తమ హక్కుల కోసం పోరాడాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

డీఎస్పీలు శ్రీనివాసులు, వాసుదేవన్


మాట్లాడుతున్న పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు

పులివెందుల రూరల్ : ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీలు శ్రీనివాసులు, వాసుదేవన్‌లు తెలిపారు. బుధవారం స్థానిక జేఎన్‌టీయూ కళాశాలలో సైబర్ నేరాలు, సఖిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పులివెందుల డీఎస్పీ శ్రీనివాసులు, దిశా యాప్ డీఎస్పీ వాసుదేవన్‌లు హాజరై మాట్లాడుతూ లోన్ యాప్‌లు, ఉద్యోగ యాప్‌లు క్లిక్ చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. మీ చదువు, ఉద్యోగాలకు సంబంధించిన విషయాలకు మాత్రమే ఇంటర్నెట్‌ను ఉపయోగించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని మనకు అవసరమైన రీతిలో వినియోగిస్తూ చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే డబ్బులు వేరే అకౌంట్‌లోకి వెళితే ఏ నెంబర్‌కు కాల్ చేయాలి.. మొబైల్ పోగొట్టుకుంటే ఎలా దాన్ని తిరిగి తీసుకోవచ్చు.. ఎవరైనా ఇబ్బందులలో ఉన్నప్పుడు దిశ యాప్‌కు ఎలా కనెక్టు కావాలి, వన్‌స్టాప్ సెంటర్ ద్వారా ఇబ్బందులకు గురైన వారు ఎలా ఉపశమనం పొందవచ్చుననే విషయాలపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వసుంధర, మహిళా సాధికారిత కో ఆర్డినేటర్ శేష మహేశ్వరమ్మ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నాసిరకం మొక్కలతో జాగ్రత్తగా ఉండాలి


అరటి తోటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ సుశీల, తదితరులు

వేంపల్లి : అరటి రైతులు నాసిరకం మొక్కలతో జాగ్రత్తగా ఉండాలని పులివెందుల అరటి పరిశోధనా కేంద్ర శాస్త్రవేత్త డాక్టర్ సుశీల తెలిపారు. బుధవారం వేంపల్లె మండలంలోని అమ్మగారిపల్లె, వీరపునాయునిపల్లె మండలంలోని మర్రిపల్లె గ్రామాల్లోని అరటి తోటలను జిల్లా ఉద్యాన శాఖాధికారిణి సుభాషిణి హెచ్‌ఓ రెడ్డయ్యలతో కలసి పరిశీలించి మాట్లాడారు. రెండు మండలాలకు సంబంధించి బెంగుళూరుకు చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ వారు సరఫరా చేసిన 50 వేల అరటి మొక్కలలో దాదాపు 8 వేల వరకు నాసిరకం అరటి మొక్కలు ఉన్నట్లు గుర్తించామన్నారు. అందులో ఎక్కువ శాతం గెలలు వేయని మొక్కలు, గెలలు వేసిన సరైన సైజులు రాకపోవడం, చిన్న, చిన్న గెలలు వేయడం తదితర వాటిని గుర్తించామన్నారు. రైతులు మొక్కలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా ఆ కంపెనీ బిల్లులను తీసుకోవాలని సూచించారు. అప్పుడే ఇలాంటి సమస్యలు వచ్చినప్పుడు వారిపై చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కనీస మద్దతు ధరతో శనగల కొనుగోలు


శనగల కొనుగోలును పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి ఓబులేసు

పెద్దముడియం : మార్క్‌ఫెడ్-నాఫెడ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం బుడ్డ శనగల కనీస మద్దతు ధర రూ.5335తో కొనుగోలు చేస్తోందని మండల వ్యవసాయాధికారి ఓబులేసు తెలిపారు. బుధవారం ఆయన పెద్దపసుపుల గ్రామంలోని కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు మొదట ఆర్బీకే కేంద్రాలలో శనగల విక్రయానికి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. రైతులు నాణ్యమైన శనగలను మాత్రమే కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కొందరు రైతులు శనగలు అక్కడక్కడ డ్యామేజీ వచ్చాయని ఆయన దృష్టికి తీసుకురాగా 4 శాతం కన్న తక్కువగా ఉన్న డ్యామేజీ శనగలను మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రవాణా ఖర్చులు, కాటా ఖర్చులు, లారీ లోడింగ్ కూలీల ఖర్చులు రైతులే భరించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి


రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ

కమలాపురం : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అడిషనల్ డీఎం అండ్ హెచ్‌ఓ ఖాదర్‌వల్లి తెలిపారు. బుధవారం స్థానిక క్రాస్ రోడ్డులో నూతనంగా ప్రారంభించిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అలాగే యూ పీహెచ్‌సీలో ఉన్న వసతుల గురించి సిబ్బందితో ఆరా తీశారు. మందుల సరఫరా ఎలా ఉంది? కొరత ఏమైనా ఉందా? వైద్య పరికరాలు ఇంకా ఏమైనా రావాల్సినవి ఉన్నాయా? అని వైద్యాధికారి నందకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనీమియా, హైరిస్క్ గర్భిణులను ఏ విధంగా గుర్తిస్తున్నారు? వారిని ఎక్కడికి రెఫర్ చేస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ పై శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసులు, లక్ష్మీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి రవీంద్రారెడ్డిని గెలిపించండి


వేములలో పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తున్న మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి

వేముల : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి కోరారు. బుధవారం వేములలో పీసీబీ డైరెక్టర్ మరకా శివకృష్ణారెడ్డితో కలసి ఆయన పట్టభద్రుల ఓటర్లు ఉన్న ప్రతి ఇంటికీ వెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. రవీంద్రారెడ్డికి తమ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి.. వేయించి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించి అండగా ఉంటారని ఆయన అభ్యర్థిత్వాన్ని బలపరచాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, ఎంపీటీసీ నరసింహారెడ్డి, కో ఆప్షన్ సభ్యులు మండి మాపీరా, మాజీ ఎంపీటీసీలు రాధాకృష్ణ, మల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రాజన్న, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు నాగేళ్ల హర్షవర్ధన్‌రెడ్డి, నాగేళ్ల మహేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు రాఘవరెడ్డి, చలపతి, రామసుబ్బారెడ్డి, ఏ.పుల్లారెడ్డి, గంగిరెడ్డి, పోరెడ్డి సుబ్బారెడ్డి, బస్సు సుబ్బారెడ్డి, శ్రీధర్, వెంకటశివారెడ్డి, శివశంకర్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్, నారాయణస్వామి, వేమ నారాయణరెడ్డి, నాగప్ప, మైనార్టీ నాయకులు గౌస్ పీరా, మదర్సావల్లి తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల టౌన్ : మార్చి 13న జరిగే పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని కౌన్సిలర్ లక్ష్మీప్రసన్న పట్టభద్రుల ఓటర్లను అభ్యర్థించారు. బుధవారం పట్టణంలోని 26వ వార్డు పరిధిలోని గోపి విహార్ వీధి, నగరిగుట్ట ప్రాంతాలలో ఆమె పట్టభద్రులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పద్మనాభరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురం : స్థానిక వైఎస్సార్‌సీపీ మండల నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డిలు సింహాద్రిపురంలో ప్రతి ఇంటికీ వెళుతూ పట్టభద్రులను కలిసి త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ జాఫర్, మల్లికార్జునరెడ్డి, తేజారెడ్డి, శేఖర్‌రెడ్డి, బషీర్, ఖాదర్ వలి, మహమ్మద్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.